


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

**88**

**(13' ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**స్వతంత్రం** వచ్చి పాతికవత్సరాలైంది. రజతోత్సవ సన్నాహాలు జరుగుతున్నాయి. అతి వ్యాప్తంగా అట్టహాసంగా! ఈ పాతిక వత్సరాలలో దేశం ఏం సాధించిందంటే ఎన్నో చెప్పవచ్చు. ఏం సాధించలేదంటే అంత కంటే పెద్ద జాబితా తయారు చెయ్యవచ్చు.

వీటి సంగతి అలా వుంచి, పిల్లల్లో, పెద్దల్లో దేశీయాభిమానం ఎంతవరకు ఏర్పడిందనే విషయం ఆలోచిస్తే పిచ్చిగుడ్లు వెయ్యక తప్పదు. ప్రస్తుతానికి పిల్లల విషయం తీసుకుందాం. వారికి దేశ నాయకుల పేర్లు ఎంతవరకు తెలుసు? అని ప్రశ్నిస్తే చాలా హాస్యం బయటపడుతుంది.

***కందుకూరి ప్రకాశంగారురా!***

ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశంగారి జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అంతటా కమిటీలు వేశారు. ఎన్నో స్మారక చిహ్నాలు నెలకొల్పబోతున్నారు. ఒక జిల్లాకు ఆయన నామం అంకితం చేశారు. ఎంతో గర్వించతగిన విషయం. అన్నింటికన్నా ముఖ్యం ఈ కాలపు పిల్లలకు ఆయన చరిత్రను బోధించండం. దాని ద్వారా భవిష్యత్తులో కూడా కొంత 'ప్రకాశత్వం' సాధించడం అవసరమేమోననిపిస్తుంది. చిన్న తరగతుల్లో పిల్లలకు ఎన్ని పాఠాలో చెప్పి వదలడం కంటే ఒక్క నాయకుని జీవితం ఒక్క కవి జీవితం చక్కగా బోధిస్తే వాళ్ళ మనసుల్లో మల్లెతోటలు వేసినంత పని అవుతుంది. మొన్న ఒకరింటికి వెళ్ళాను. వాళ్ళ అబ్బాయి ఏడోక్లాసు చదువుతున్నాడు. అప్పటికే వాళ్ళ బుర్ర పాదరసమైపోతుందని - పట్టి సీసాల్లో బిగించి, సీలువేసి చేతికి అందించాలని ప్రభుత్వం గవర్నమెంటు పరీక్షలు పెట్టింది. దాంతోమేలు జరగడం ఎలా వున్నా పరీక్ష అంటే భయం మాత్రం పోయింది.

పైన చెప్పిన కుర్రవాడు ఒక పాతికమంది దేశనాయకుల బొమ్మలు తెచ్చాడు. అన్నీ ఒక సైజులో వున్నాయి. వాటిని చీట్ల పేకలాగా కలుపుతున్నాడా కుర్రవాడు. కొంచెం సేపు కల్పి ప్రక్కనున్న తమ్ముడికో ముక్కా, చెల్లెలికో ముక్కా ఇచ్చి - వాళ్ళ పేరు చెప్పమంటున్నాడు. బుద్దుడు, గాంధీ నెహ్రూ బొమ్మలు మాత్రం చెప్పుకో కలిగారు.

నేను వెళ్ళిన తర్వాత ఒక బొమ్మను చూపించి ఎవరో చెప్పమన్నారు. "ప్రకాశంగారు" అన్నారు.

ఆ పెద్ద కుర్రవాడు"అవునవును నేననుకున్నాను" అని తమ్ముడి వంక చూసి "అవునురా! కందుకూరి ప్రకాశంగారు" అన్నాడు. మాకెంతో నవ్వూ దానితోపాటు ఆశ్చర్యం వేసింది.

"కందుకూరి కాదు నాయనా టంగుటూరి " అన్నాను.

"అలాగా! టంగుటూరి, కందుకూరి ఒకలాగానే వున్నాయి" అని ఒక మానికెడు మొలక నవ్వులు గుమ్మరించాడు.

"కందుకూరి వీరేశలింగంగారురా! ఆయన సంస్కర్త" అన్నది వాళ్ళ అమ్మగారు. అని ఆమె తొందరగా చెప్పడంలో "ఆయనగారు విధవావివాహాలు బహిష్కరించారు" అన్నది. వెంటనే మళ్ళీ "ప్రోత్సహించారు" అన్నది.

***భార్యాభర్తల్లో ఎవరు పోయినా రెండోవారిని...***

"చాలా గొప్ప సంస్కారి ఆయనగారు. రాజమండ్రిలో వితంతువుల ఆశ్రమం ఒకటి స్థాపించారు. ఎన్నో వివాహాలు చేశారు" అన్నారు తండ్రిగారు.

ఏడో తరగతి కుర్రవాడు - తన చరిత్రాజ్ఞానాన్ని ఒక్కసారిగా ప్రదర్శించాలని "మరి అంతకు ముందు ఏంచేసేవారో తెలుసా! మొగుడు చచ్చిపోయినా, పెళ్ళాం చచ్చిపోయినా ఇద్దర్ని కలిపి నిప్పుల్లో త్రోసిపారేసేవారు" అన్నాడు.

మాకు పొట్టచెక్కలయ్యేంత నవ్వు వచ్చింది. వాళ్ళ అమ్మగారు "అదికాదురా! భర్తపోతే భార్యను కూడా చితిలో తోసేవారు. సహగమనం అంటారు దాన్ని" అని చెప్పింది.

"మరి భార్యపోతే భర్త నెందుకు తోసేవారు కాదూ?" అని ప్రశ్నించాడు రెండోవాడు.

"మగవాణ్ణి తోస్తే వూరుకుంటాడేమిట్రా! తంతాడని భయం. అందుకని ఆడవాళ్ళనే తోసేవాళ్ళు గావన్ను" అన్నాడు పెద్దవాడు.

***చక్రవర్తా! సినిమా యాక్టరా***

తర్వాత మళ్ళీ బొమ్మలు తీసి పేర్లు చెప్పడం ప్రారంభించారు. చవన్ బొమ్మ వచ్చింది. టోపీలేదు. చాలాసేపు ఆలోచించారు. బొమ్మ చాలా స్థూలంగా కనిపించింది. అందుకని కాబోలు వెంటనే "పృధ్విరాజు" అన్నాడు పెద్ద అబ్బాయి.

"చక్రవర్తా? సినిమా యాక్టరా!" అని తండ్రిగారు ప్రశ్నించారు.

"చక్రవర్తే.. మాకు అయిదోక్లాసులో వచ్చాడు. చాలా బలపరాక్రమములు గలవాడు. అని వుంది పాఠంలో" అన్నాడు ఏడవ తరగతి విద్యార్థి.

"పృధ్విరాజ్ ఎప్పుడు దేశాన్ని పాలించాడు? ఏం చేశాడు?" అని తల్లి ప్రశ్నించింది.

"ఏమో? ఏం చేశాడో? ఎవడికి జ్ఞాపకం. అసలు ఆ ప్రశ్న వదిలేశానప్పుడు" అన్నాడు అతి తేలికగా.

నిజమే ఆ మూడు పేజీల పాఠాలూ ముక్కుకు రాచుకోవడం పరీక్ష అవగానే దులిపి పారెయ్యడం. ఆ తరగతి పంతులుగారికి అంతవరకే బాధ్యత. వాళ్ళ బుర్రల బాధ్యతలు ఎంతవరకు తీసుకోగలరు? ఇప్పుడున్నవి గురుకులాలా! గురుశిష్యసాంప్రదాయాలా! పరీక్ష ప్యాసు కావడం గుడ్డిలో మెల్ల. తప్పితే కంట్లో పువ్వు.

***టోపీ తీసి మనల్ని టోపీ వేశాడురా.***

చివరకు ఆ బొమ్మ తెచ్చి నాకు చూపించారు. "ఈయన - చవన్. మన కేంద్ర ఆర్థికమంత్రి" అన్నాను.

"చవనా! ఎవరబ్బా! ఎక్కడో చూశానే అనుకొన్నా" అని తమ్ముడివంక చూచి "టోపీ తీసేశాడు. మనల్ని టోపీలో వేసాడు. అయినా ఇందరు మంత్రుల పేర్లు, ఫోటోలూ ఎవరికి జ్ఞాపకం వుంటాయి. ఏరా తమ్ముడూ?" అన్నాడు.

తమ్ముడికి ఎంతో రోషం వచ్చినట్లుంది.

"ఆ! నాకు పదిమంది తెలుసు. ఇందిరాగాంధి, బ్రహ్మానందరెడ్డి, పి.వి నరసింహారావు, ఇంకా ఇంకా.. " అని మూడు వేళ్ళు ముడిచి నాలుగోది ముడవడం కుదరక ఆలోచిస్తున్నాడు.

అన్నగారు ఎంతో తొందరగా "సంజీవరెడ్డి.. " అన్నాడు. వాళ్ళనాన్నగారు - "బ్రహ్మానందరెడ్డి, సంజీవరెడ్డి ఇపుడు మంత్రులుగాలేరు - మాజీ మంత్రులు" అన్నాడు.

పెద్దకుమారుడు పెద్దగా ఆలోచించనక్కరలేదన్నట్లుగా "ఏమో! మళ్ళీ వస్తాడేమో" అన్నాడు.

తర్వాత మళ్ళీ నాయకుల ఫోటోలు తీశారు. అందులో ఒకదానిపేరు తెలియలా! చాలాసేపు ఆలోచించి "ఈయనెవరండి?" అన్నారు.

"ఆయన మదన మోహన మాలవ్యా!చాలా గొప్ప. కాశీవిద్యాలయం కట్టించారు" అన్నాను.

"మాలవ్యా" అంటే ఏమిటి అన్నాడు తమ్ముడు.

"మనకు మల్లయ్య... వాళ్ళకు మాలవ్యా."

"ఏమిటంటావేమిటి పేరు. మనం మల్లయ్యా అనం. అలాగే వాళ్ళు మాలవ్యా అంటారు. దానికేంలే" అన్నాడు.

తర్వాత ఇంకో ఫోటో తీశారు. వారికి తెలియలేదు. "సర్దార్ పటేల్" అన్నాను.

"ఈయన్ని ఎక్కడో చూచినట్లున్నామే! ఏ ఊరు?" అన్నాడు ఒక సోదరుడు.

"ఆయన ఇక్కడివాడు కాదు. పోయి చాలాకాలమైంది. మీరెక్కడ చూశారు" అన్నాడు తండ్రి.

"ఎక్కడో గుర్తులేదు" అన్నాడు పెద్దవాడు.

"నాలుగోక్లాసు పుస్తకంలో వుందిరా బొమ్మ?" అన్నాడు.

"ఆ! అందులోనే చూసి వుంటాను" అని అన్న నవ్వుకున్నాడు.

నేనప్పుడు చెప్పాను "ఈ నాయకులందర్ని గురించి తలోరోజు చెపుతాను. వింటావా! మీకు బాగా తెలుస్తుంది మన చరిత్ర" అన్నాను.

"ప్రతిరోజూ రాలేమండీ.. ప్రతి ఆదివారం వస్తాం" అన్నాను.

అందుకే ఎంతో సంతోషించి వచ్చేసాను.

Post your comments